నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | ADILABAD

## జిల్లావాసికి రాష్ట్రస్థాయి ర్యాంకు

### గ్రూప్-4లో మూడో ర్యాంకు సాధించిన కరంజి(టి) అభ్యర్థి



తల్లిదండ్రులతో సాయికృష్ణ

భీంపూర్, ఫిబ్రవరి 10 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన సాయికృష్ణ యాదవ్ తాజాగా ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. బక్కి మమత-రమేశ్‌ల కుమారుడు కాగా.. ఈయన తండ్రి రమేశ్ పోలీసు హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయికృష్ణ పాఠశాల, కళాశాల విద్య ఆదిలాబాద్‌లోనే పూర్తి చేశాడు. తలిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయులు, లెక్చరర్లు అందించిన ఉత్తమ బోధనతోనే సాధించ గలిగానని తెలిపాడు. తమ కుమారుడికి రాష్ట్రస్థాయి ర్యాంకు రావడంపై తలిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం జేశారు. కాగా.. గ్రూప్-4 నోటిఫికేషన్ బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే వెలువడిన విషయం తెలిసిందే.

## ఏరోడ్రమ్ భూముల వివరాలు సమర్పించండి..

### ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



ఏరోడ్రమ్ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్


ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం ఏరోడ్రమ్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరోడ్రమ్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలం, సరిహద్దు వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గుండుసున్నా..

## రాష్ట్ర బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు మొండిచేయి..

- జిల్లావాసులకు ఒరిగింది శూన్యం
- ప్రాజెక్టుల ఊసు లేదు.. ఇందిరమ్మ ఇండ్లపై నిరాశే..
- గిరిజనాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ఏమిలేదు..
- కాంగ్రెస్ తీరుపై దుమ్మెత్తి పోస్తున్న జనం



### వ్యవసాయం, సంక్షేమ రంగాలను విస్మరించారు..



కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ రంగాలను పూర్తిగా విస్మరించింది. వ్యవసాయ రంగం అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఉచిత బస్సు పేరిట మహిళల సంక్షేమానికి కేటాయింపులు జరుపలేదు. అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగానికి నిధులు కేటాయింపు సరిగా లేదు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. మ్యానిఫెస్టోతోపాటు డిక్లరేషన్‌ల ప్రస్తావన లేదు. ప్రజలకు 420 హామీలను ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించి ట్రయల్ రన్ పూర్తయిన చనాక-కొరాట ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్‌లకు నిధులు కేటాయించకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. *- జోగు రామన్న, మాజీ మంత్రి.*

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా పలు హామీలను నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో మొండిచేయి చూపించింది. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీలో భాగంగా ప్రజాపాలన పేరిట డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఇందిరమ్మ ఇండ్ల కోసం 1,99,803 దరఖాస్తులు వచ్చాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు తెలియజేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తారని అందరూ భావించారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. దాదాపు రెండు లక్షల మంది ఇండ్లు లేని పేదలు ఉండగా 4 శాతం మాత్రమే గృహాల మంజూరు ఇవ్వడంతో పేదలు నిరాశ చెందుతున్నారు. గిరిజనాభివృద్ధికీ ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ప్రాజెక్టుల ప్రస్తావన ఏదీ..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టుల్లో తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలిగి ఆయకట్టుకు నీరు అందించే వాటిని సత్వరమే పూర్తి చేయాలనేది ప్రభుత్వ ఆలోచన అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. రాష్ట్రం వ్యాప్తంగా పలు పలు సాగునీటి ప్రాజెక్టులను ప్రస్తావించినా ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క ప్రాజెక్టు పేరు ఎత్తలేదు. మహారాష్ట్ర సరిహద్దులో జైనథ్ మండలం పెన్‌గంగాపై రూ.1,227 కోట్లతో నిర్మిస్తున్న చనాక-కొరాట ప్రాజెక్టు వల్ల జిల్లాలోని ఐదు మండలాల్లోని 51 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. బ్యారేజ్, పంప్‌హౌస్, మెయిన్ కెనాల్స్ పనులు పూర్తికాగా అధికారులు ఇటీవల ట్రయల్‌రన్ కూడా విజయవంతంగా నిర్వహించారు. డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాల్సి ఉంది. చిన్న పనులు కావడంతో తక్కువ ఖర్చుతో రైతుల ఆయకట్టుకు నీరు అందే అవకాశాలున్నాయి. చనాక-కొరాట ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు ఉంటుందని ఆశించినా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ప్రాజెక్టు ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కడెం ప్రాజెక్టు పైన కూడా నేరడిగొండ మండలం కుప్టి వద్ద ప్రాజెక్టుకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డీపీఆర్ కూడా పూర్తికాగా నిధులు మంజూరు చేసే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై కూడా రైతులు ఆశలు పెట్టుకున్నారు. బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం రైతులను నిరాశకు గురిచేసింది.

### ఆశలపై నీళ్లు చల్లారు..



కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసింది. ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలను ఎప్పుడు అమలు చేస్తామనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తామని ప్రకటించినా.. ఎప్పటి నుంచి అనే విషయాన్ని తెలియచేయలేదు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. ప్రజాపాలనలో లక్షల మంది ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రైతులకు సాగు నీరు అందించే కుప్టీ, చనాక-కొరాట, పిప్పల్‌కోటి, గోముత్రి ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం శోచనీయం. కుంటాల వాటర్ ఫాల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సి ఉన్నా బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు. *- అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్.*



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన..

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల, ఫిబ్రవరి 10 : ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధి చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అర్లి ఎక్స్ రోడ్డు వద్ద ఉమ్మడి కుంటాల మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయాలు తీసుకున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ కన్వీనర్లు దత్తు, పాపెన్ రాజేశ్వర్, జడ్పీటీసీ గంగామణి, సొసైటీ చైర్మన్ గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శంకర్ గౌడ్, అశోక్ రెడ్డి, గోనె గజ్జారాం, రమణ గౌడ్, ప్రవీణ్, దశరథ్, రజనీకాంత్, ఖదీర్, హైమద్ పాషా, భాస్కర్, మహేశ్, సదాశివ్ పటేల్, రాకేశ్, గజేందర్ పాల్గొన్నారు.

## రేవంతు.. జీతాలివ్వు..

- మూడు నెలలుగా వేతనాలు రాక అవస్థలు పడుతున్నాం..
- మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నా స్పందన లేదు..
- ఉట్నూర్ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం

ఉట్నూర్, ఫిబ్రవరి 10 : 'మూడు నెలలుగా వేతనాలు రాక అవస్థలు పడుతున్నాం. మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నా మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేదు.' అని ఉట్నూర్ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకుడు సుభాష్ మండిపడ్డారు. శనివారం స్థానిక ప్రభుత్వ దవాఖానలో మూడో రోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ జీతాలు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది సరైన సమయంలో ఫీజులు కట్టుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ఎంవో మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు.




నినాదాలు చేస్తున్న సిబ్బంది

## టీజీ యూజీ సెట్‌కు సర్వం సిద్ధం


- ఆర్సీవో స్వరూపారాణి
- 25 పరీక్షా కేంద్రాలు.. 8,844 మంది విద్యార్థులు..

ఎదులాపురం, ఫిబ్రవరి 10 : తెలంగాణ గురుకులం అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీ యూజీ సెట్)కు సర్వం సిద్ధం చేశామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(ఆదివారం) 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 25 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇందులో మంచిర్యాలలో 8, ఆసిఫాబాద్‌లో 9, ఆదిలాబాద్ 8 ఉన్నాయన్నారు. అలాగే 8,844 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో ఆదిలాబాద్‌లో 2,727, మంచిర్యాలలో 3,335, ఆసిఫాబాద్‌లో 2,782 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.



నాగోబా ఆలయంలో భక్తులకు హరిత ఇస్తున్న మెస్రం వంశీయులు





సతీక్‌దేవతలను దర్శించుకుంటున్న కొత్తకోడళ్లు

కోనేరు నుంచి నీటి తీసుకొస్తూ..

సతీక్ దేవతలకు పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా

పూజలందుకుంటున్న నాగోబా విగ్రహం

## కొత్త కోడళ్లకు బేటింగ్

- సంస్కృతీ సంప్రదాయాల మధ్య సతీక్ దేవతలకు పూజలు
- 202 మంది కొత్త కోడళ్లకు నాగోబా దర్శనం
- 22 కితలకు చెందిన కొత్తకోడళ్లకు గోవాడ్ ప్రవేశం
- అవ్వాల్ దేవతకు మొక్కులు.. సహపంక్తి భోజనాలు..



నాగోబా ఆలయంలో తెల్లటి వస్త్రాలు కప్పుకుని కూర్చున్న కొత్తకోడళ్లు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10 : కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి మెస్రం వంశీయులు మహాపూజ నిర్వహించిన అనంతరం సంస్కృతీ సంప్రదాయం ప్రకారం 202 మంది కొత్త కోడళ్లకు పరిచయ కార్యక్రమం(బేటింగ్) నిర్వహించారు. అనంతరం పెద్దల సమక్షంలో సతీక్ దేవతను పూజించారు. నాగోబాను దర్శించుకున్న తర్వాత మెస్రం వంశీయుల కోడళ్లుగా స్వీకరించారు. అనంతరం వారికి సంప్రదాయబద్ధంగా గోవాడ్‌లో ప్రవేశం కల్పించారు.

### గోవాడ్‌లో శుద్ధి కార్యక్రమం

మెస్రం వంశీయుల మహిళలతో కొత్తకోడళ్లు గోవాడ్‌లో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 కితలకు చెందిన కొత్తకోడళ్లు ఉదయం గోవాడ్ నుంచి మర్రిచెట్ల ప్రాంతంలోని కోనేరుకు వెళ్లారు. అక్కడి నుంచి బిందేలతో నీటిని తీసుకొచ్చి గోవాడ్‌లో ఆ జలాన్ని చల్లుతూ శుద్ధి చేశారు. అనంతరం గోవాడ్‌లో వారి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 22 కితల నుంచి సేకరించిన నవధాన్యాలతో నైవేద్యాన్ని వండారు. అందరూ కలిసి వంటలు చేసి కితలవారీగా పంచుకున్నారు.

### అవ్వాల్ దేవతకు పూజలు

మెస్రం వంశీయుల మహిళలతోపాటు కొత్తకోడళ్ల ఆధ్వర్యంలో 22 కితలవారీగా అవ్వాల్ దేవతకు దీపాలు వెలిగించి సంప్రదాయ పూజలు నిర్వహించారు. నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉపవాస దీక్షలు విరమించి సామూహిక భోజనం చేశారు. కాగా.. నాగోబా ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న గోవాడ్‌లో మెస్రం వంశీయుల మహిళలు సంప్రదాయ పూజలు నిర్వహించారు. గోవాడ్‌లో బస చేసిన మహిళలు కితలవారీగా 22 పొయిలపై సామూహికంగా వంటలు చేస్తున్నారు. నైవేద్యాలు ఉంచిన వెదురు బుట్టల వద్ద దీపాలు వెలిగించి సంప్రదాయ పూజలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. గోవాడ్‌లో మహిళలు కుర్చొని నాగోబా చరిత్రతోపాటు మెస్రం వంశీయుల సంప్రదాయాలపై చర్చిస్తున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



నాగోబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ విఠల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈవో విజయరామారావు

## రేపటి నుంచి వసంత పంచమి ఉత్సవాలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..
- ఆలయ ఈవో విజయరామారావు

బాసర, ఫిబ్రవరి 10 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో వసంత పంచమి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రేపటి నుంచి 14వ తేదీ బుధవారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రత్యేక దర్శనం ద్వారా అక్షరాభ్యాస పూజలకు వచ్చే భక్తులు, చిన్నారులకు దాతల సహకారంతో ఉచితంగా పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తామన్నారు. అర్జిత సేవలను నిలిపివేసినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం మూడు చోట్ల స్థలాలు ఏర్పాటు చేశామని, పోలీసు బందోబస్తు కూడా ఉంటుందని తెలిపారు. ఉచిత అన్నదాన నిర్వహణ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని తెలిపారు. ఈ పట్టువస్త్రాలను అఖిల భారత పద్మశాలీయ అన్నసత్రం తరపున చేనేత మగ్గంపై తయారు చేసి అందించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు రాపోలు సుధాకర్ తెలిపారు. నిత్య చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారిలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, ఏఈవో సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.